

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 25-11-2025 సంపుటి : 07 సంచిక 198 పేజీలు : 8 వెల : రూ 3-00



## రామాలయ శిఖరంపై పతాకావిష్కరణ

అయోధ్య: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయోధ్యలోని రామ జన్మభూమి మందర్‌ను ఈనెల 25న దర్శించనున్నారు. రామాలయ నిర్మాణం పూర్తయినందుకు సంకేతంగా శ్రీరామజన్మ భూమి మందిర శిఖరంపై పతాకాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. ఈ ఘట్టం దేశ సామాజిక-సాంస్కృతిక-ఆధ్యాత్మిక ప్రయాణంలో మరో మైలురాయిగా పేర్కొంటున్నారు. ఇదేరోజు మార్గశిర మాసంలోని శుక్లపక్షంలో వచ్చే పంచమి కావడం, ఇదే అభిజిత్ ముహూర్తంలో సీతారాముల వివాహ పంచమి కూడా కావడం విశేషం. సిక్కుల తొమ్మదవ గురువు గురుతేజ్ బహదూర్ ఆత్మబలిదాన దినోత్సం కూడా ఇదే రోజు వస్తోంది. 17వ శతాబ్దంలో అయోధ్యలో గురుతేజ్ బహదూర్ 48 గంటల సేపు ధ్యానం చేశారు.పధానమంత్రి మంగళవారం ఉదయం 10 గంటలకు వశిష్ట, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి, దేవి అహల్య, నిషదరాజు గుహుడు, శబరి మాత మందిరాలతో కూడిన సప్తమందిర్‌ను దర్శిస్తారు. 11 గంటలకు శేషావతార్ మందిర్, మాతా అన్నపూర్ణ మందిరాలను దర్శించుకుంటారు. రామ దర్బార్ గర్భగృహం, రామలీలా గర్భగృహంలో పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో శ్రీ రామజన్మ భూమి మందిర్ శిఖరంపై కాషాయం రంగు పతాకాన్ని ప్రధాని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా రామరాజ్యం ఆదర్శాలు, జాతీయ సమైక్యత, భారతదేశ సమున్నత వారసత్వంపై ప్రధాని ప్రసంగిస్తారు.రామమందిరానికి సహాయం చేసిన దాతలను ఈ వేడుకలకు అధికారికంగా ఆహ్వానించనున్నట్లు ట్రస్ట్ ఇప్పటికే ప్రకటించింది. దేశం నలుమూలల నుంచి సుమారు 8000 మంది ఆహ్వానితులు ఈ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు.



## 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ: భారతదేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారంనాడు జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆదివారంనాడు పదవీ విరమణ చేసిన సీజేఐ బిఆర్ గవాయ్ స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఈ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల చీఫ్ జస్టిస్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం.జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్శిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు.2019మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. వివిధ ధర్మాసనాల్లో పలు కీలక తీర్పుల్లో ఆయన భాగమయ్యారు. 370వ అధికరణను రద్దు చేస్తూ చారిత్రక తీర్పు ఇచ్చిన ధర్మసనంలో ఉన్నారు. బిహార్ ఎన్నికల జాబితా రివిజన్, పెగాసస్ స్పైవేర్ తీర్పులు కూడా ఉన్నాయి.


## రీఓపెన్ దరఖాస్తులు వేగంగా క్లియర్ చేయాలి

### పిజిఆర్ఎస్‌లో 220 అర్జీలు:కలెక్టర్ రాజకుమారి గణియా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 24 :పిజిఆర్ఎస్ ద్వారా రీఓపెన్ అయిన దరఖాస్తులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.రీఓపెన్ అయిన 479 దరఖాస్తులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి వెంటనే క్లియర్ చేయాలన్నారు. అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా, నాణ్యంగా ఉండాలని ఆదేశించారు.బియాండ్ ఎసిఏలో ఉన్న 5 దరఖాస్తులు, ఇంకా పరిశీలించని 63 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విఐపి గ్రీవెన్స్‌లు, పెండింగ్ ఆడిట్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈరోజు మొత్తం 220 మంది అర్జీదారులు తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించగా, వాటిని తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.



## స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్..



అమరావతి: ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టంపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సమగ్ర సమాచారంతో స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్ ఉంటుందన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ డేటా లేక్‌తో కుటుంబం, వ్యక్తుల వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలు, పౌరసేవల పర్యవేక్షణకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్ ఒక్కటే ఉంటుందని తెలిపారు. కుటుంబ సాధికారిత కోసం ఈ వ్యవస్థను వినియోగించాలని చంద్రబాబు సూచించారు. కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు చేయాలని సీఎం పేర్కొన్నారు.రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు జూన్ నాటికి క్యూఆర్ కోడ్‌తో కూడిన ఫ్యామిలీ కార్డును జారీ చేయాలని అధికారులకు సూచించారు. 25 రకాల వివరాలతో పాటు పీ4 లాంటి అంశాలను అందులో చేర్చాలని తెలిపారు. ఆర్టీజీఎస్ వద్ద ఉన్న సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకుని ఇతర ప్రభుత్వ శాఖలు వినియోగించుకోవాలని చెప్పారు. స్టాటిక్ డేటా, డైనమిక్ డేటా వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేసేలా చూడాలన్నారు.వాక్సినేషన్, ఆధార్, ఎఫ్‌బీఎంఎస్ ఐడీ, కుల ధృవీకరణ, పౌష్టికాహారం, రేషన్ కార్డు, స్కాలర్‌షిప్, పెన్షన్లు సహా వేర్వేరు ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించిన వివరాలన్నీ ఈ కార్డు ద్వారా ట్రాకింగ్ జరిగేలా చూడాలన్నారు. కేవలం పెన్షన్లు, రేషన్ వంటి పథకాల వివరాలకు మాత్రమే ఈ ఎఫ్‌బీఎంఎస్ వ్యవస్థను పరిమితం చేయొద్దని, పౌరులకు చెందిన అన్ని వివరాలనూ నమోదు చేసేలా ఈ కార్డు ఉండాలని ఆదేశించారు. సుపరిపాలనలో భాగంగా ఈ కార్డు ద్వారా అర్హులైన వారందరికీ పథకాలు అందించటంతో పాటు సులభంగా పౌర సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొన్ని పథకాలకు లబ్దిదారుల ఎంపికలో ఎదురవుతున్న సవాళ్లు కూడా ఈ వ్యవస్థ ద్వారా పరిష్కారం అవుతాయని వెల్లడించారు

## పిజిఆర్ఎస్ అర్జీలను సీరియస్ గా తీసుకోవాలి:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, నవంబర్ 24 పిజిఆర్ఎస్ అర్జీలను సీరియస్ గా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు..సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.. అధికారులందరూ పిజిఆర్ఎస్ లో ప్రతి రోజు లాగిన్ అయి ఎట్ టూ వ్యూ అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు..వచ్చిన వెంటనే అర్జీలను చూస్తే, రెవెన్యూ అర్జీల లాంటి వాటికి నోటీసులు ఇచ్చే టైమ్ ఉంటుందని కలెక్టర్ సూచించారు. ఇంప్రాపర్ రెడ్రెస్సల్, ఎండార్స్మెంట్ లు సరిగా ఇవ్వకపోవడం,రీఓపెన్‌అయిన కేసులకు సంబంధించి ఆయా శాఖల పరిధిలో ఉన్నకిందిస్థాయి అధికారులకు మెమో లు జారీ చేసి, సంబంధిత మెమో లను వాట్సప్ గ్రూప్ లో పోస్ట్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. 10 రోజులకు ఒకసారి వివిధ శాఖల హెచ్ ఓ డి లు వారి కింది స్థాయి సిబ్బందితో పిజిఆర్ఎస్ అంశం పై ట్రైనింగ్ లు నిర్వహించాలని, ఆ ఫోటోలను గ్రూప్ లో కూడా పోస్ట్ చేయాలన్నారు.. అదే విధంగా ప్రతి రోజు కొంతమంది అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు.. అర్జీలు గడువు లోపు నాణ్యతతో పరిష్కరించాలని, రీ ఓపెన్ కేసుల శాతాన్ని పూర్తిగా తగ్గించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్యసేవ కి సంబంధించి అన్ని ఆసుపత్రులలో జిల్లాలో ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ ప్రదర్శించాలన్నారు.. టోల్ ఫ్రీ ద్వారా ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.. పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో క వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. ముఖ్యంగా రోడ్లు, పారిశుధ్యం, త్రాగు నీరు,మున్సిపాల్టీ లలో సమస్యలకు సంబంధించి పత్రికల్లో ఎక్కువగా వార్తలు వస్తున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఒకే సమస్యపై అర్జీదారులు పలుమార్లు తిరగకుండా సమస్యను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రాబోయే వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎస్.ఎస్. ట్యాంకులు, మైనర్ ఇరిగేషన్ చెరువులను ఆర్డీవోలు తనిఖీ చేసి మరమ్మతులు ఉంటే, 10 రోజులలోపు మరమ్మతులు పనులు పూర్తి చేసి, డిసెంబర్.లో ట్యాంక్ లు, చెరువులు నీటిని నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు.. గ్రామాల్లో, మండలాల్లో రక్షిత పథకాల నుండి త్రాగు నీరు అందరికీ సమానంగా, సక్రమంగా పంపిణీ చేసేలా మండల లెవెల్ స్థాయిలో సమావేశం నిర్వహించి, అందరికీ తాగు నీరు అందేలా కలెక్టర్ ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ, డి పి ఓ లను ఆదేశించారు..




# సంపాదకీయం

మంగళవారం 25-11-2025

## ఇక విద్యావిధానంపై దృష్టి

ప్రధాని నరేంద్రమోదీ మెకాలే విద్యా విధానాన్ని 2035 నాటికి భారత్ నుంచి పూర్తిగా తొలగించాలనే సంకల్పం వ్యక్తం చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అని చెప్పొచ్చు. ఇది భారత ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించే సాహసోపేత ప్రయత్నం. ఇప్పటి ప్రపంచం టెక్నాలజీ ఆధారంగా వేగంగా మారిపోతుంది. ఆర్టిఫిషియల ఇంటలిజెన్స్ అంటే అంతర్జాతీయ మేధస్సు ముఖ్యంగా అమెరికా టెక్నాలజీ ప్రభావం ప్రపంచాన్ని ఒకే గ్లోబల్ విలేజ్‌గా మార్చేస్తోంది. అందువల్ల ప్రపంచ ధోరణికి అనుగుణం గా మన విద్యా విధానాన్ని మలచడం అవసరం.దేశ భవిష్యత్తు నిర్మాణానికి అఖండ పునాదిగా నిలవాల్సిన భారత విద్యా వ్యవస్థ,, నేడు లోపాలు, నిర్లక్ష్యం, అసమానతల భారంతో ఆధారాలు దెబ్బతిన్న శిఖరంలా విద్యా వ్యవస్థ క్రమంగా క్షీణిస్తోంది. విద్య కేవలం బోధన కాదు, అది ఆర్థిక స్వావలంబనకు, సాంకేతిక శక్తి సంపన్నతకు, సామాజిక న్యాయ సాధనకు మార్గం చూపే విప్లవాత్మక శక్తి. ప్రతి విద్యార్థి సక్రమంగా మానవ వనరుగా వికసిస్తే భారతదేశం జ్ఞాన విప్లవానికి కేంద్రబిందు వుగా అవతరిస్తుంది. కానీ ప్రభుత్వాల నిర్లక్ష్యం, నిధుల లోటు, విధాన అస్పష్టత నాణ్యమైన విద్యను అడ్డుకుని సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను దెబ్బతీశాయి.ఏడు దశాబ్దాల సంస్కరణలు, విద్యా కమిషన్లు, విధానాలు గుణాత్మక విద్యను అందించడంలో విఫలమయ్యాయి. అక్షరాస్యత 80.9% ఉన్నప్పటికీ ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు పరిమితంగానే ఉన్నాయి. నూతన జాతీయ విద్యా విధానం-2020 అవకాశాలు, సవాళ్లు రెండూ కలిగి ఉన్నప్పటికీ, రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా దాన్ని మలచుకుంటే విద్యలో నిజమైన సామాజిక మార్పు సాధ్యమవుతుంది.భారత విద్యా వ్యవస్థలో అత్యంత ఆందోళనకర అంశం స్థూల నమోదు నిష్పత్తి క్షీణత. విద్యా స్థాయిలు పెరిగే కొద్దీ విద్యార్థుల నమోదు పడిపోవడం దేశ భవిష్యత్తుకే సవాలుగా మారింది. 'యునైటెడ్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్' ప్రకారం ప్రాథమిక స్థాయిలో నమోదు 82.2%, హయ్యర్ సెకండరీలో 35.8%, ఉన్నత విద్యలో కేవలం 28.4% మాత్రమే. నూతన విద్యా విధానం 2035 నాటికి 50% లక్ష్యం నిర్దేశించినా, ప్రస్తుత స్థితిలో అది కష్టసాధ్యం. అభివృద్ధి చెందిన దేశాలు 6?8% జీడీపీని విద్యపై ఖర్చు చేస్తే, భారత్ ఇంకా 3% కన్నా తక్కువే ఖర్చు చేస్తోంది. కొఠారి కమిషన్ సూచించిన 6% పెట్టుబడి ఇప్పటికీ నెరవేరలేదు. ఉన్నత విద్యలో సీట్ల కొరత, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఆర్థిక లోటు, మాతృభాష బోధన లోపం సమస్యలుగా మారాయి. ఫలితంగా యువత నాణ్యమైన విద్యను పొందడంలో వెనుకబడుతోంది. అందువల్ల విద్యా సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక విధానాల అమలు అత్యవసరం.భారత విద్యా వ్యవస్థ నాలుగు స్థాయిల్లో అభివృద్ధి చెందుతున్నా ప్రతి దశకు ప్రత్యేక సవాళ్లు కొనసాగుతున్నాయి. ప్రాథమిక స్థాయిలో సర్వశిక్షా అభియాన్, మిడ్‌డే మీల్స్‌తో చేరిక పెరిగినా మౌలిక వసతుల లోపం, ఉపాధ్యాయుల కొరత, నేర్చుకునే సమస్యలు ఉన్నాయి. మాధ్యమిక స్థాయిలో నమోదు ఎక్కువైనా బాలికల డ్రాప్ అవుట్, పాత సిలబస్, నైపుణ్యాభివృద్ధి లోపం సమస్యలుగా ఉన్నాయి. ఇంటర్మీడియట్‌లో పరీక్షా ఒత్తిడి, ఆత్మహత్యలు, అధ్యాపకుల కొరత, ప్రైవేట్ కోచింగ్ ఆధిపత్యం విద్యను భారంగా మారుస్తున్నాయి. ఉన్నత విద్యలో ఐఐటీలు, ఐఎంఎంలు అంతర్జాతీయ గుర్తింపు పొందినా, 'కేంద్ర విశ్వవిద్యాలయాలు' పరిమిత అందుబాటుతో సాధారణ విద్యార్థులకు అందని ద్రాక్షలుగా మారాయి. 'రాష్ట్ర విశ్వవిద్యాలయాలు' నిధుల కొరత, అధ్యాపకుల ఖాళీలతో బలహీనపడుతున్నాయి. 'పరిశోధన'పై ప్రతికూల ప్రభావం ఏర్పడుతోంది.వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు.. అధ్యాపకులు లేకుండా ఎలా చదువుతున్నారు, ఎలా పరీక్షలు రాస్తున్నారు, ఎలా ఉత్తీర్ణులవుతున్నారు అనేదే పెద్ద ప్రశ్న. 'ప్రైవేట్ యూనివర్సిటీలు' ఆధునిక సదుపాయాలు కలిగివున్నప్పటికీ, అధిక ఫీజుల సామాన్య విద్యార్థులకు అందుబాటులో లేవు, వాటిలో రిజర్వేషన్ల అమలు లేదు. యూనివర్సిటీలకుఎన్ఐఆర్ఎఫ్ లో ప్రాంతీయ బలాలు కాపాడుతూ గ్లోబల్ ప్రమాణాలు సాధించడం సవాలుగా మారింది. 'స్కిల్ యూనివర్సిటీలు' స్థాపించడం ద్వారా, యువతకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ నైపుణ్యాధారిత విద్యా వ్యవస్థను బలపరచడానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేస్తున్నాయి. విద్యా అవకాశాలు విస్తరించినప్పటికీ నాణ్యతలో అసమానత పెరుగుతోంది. దీన్ని అధిగమించడానికి కేంద్ర,రాష్ట్ర సమన్వయం, స్థిరమైన నిధుల కేటాయింపు, నైపుణ్య ఆధారిత విద్యా విధానం, పరిశోధన ప్రోత్సాహం అత్యవసరం. విద్య-ఉద్యోగ అనుసంధాన లోపంతో ఇవి కేవలం నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారాలుగానే మిగిలిపోతున్నాయనడంలో సందేహం లేదు.సాంకేతికత ఆధునిక ప్రపంచాన్ని వేగంగా మార్చుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోటెక్నాలజీ, డిజిటల్ గవర్నెన్స్, స్పేస్ రీసెర్చ్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిణామాలను సమర్థవంతంగా నడిపే సాధనం 'శక్తివంతమైన విద్యా విధానం'. యుగంలో ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ అధ్యాపక మార్పిడి, శాస్త్ర,సాంకేతిక నైపుణ్యాలు అత్యవసరం. పాఠశాల స్థాయిలో బలమైన శాస్త్ర విద్య, నైపుణ్యాధారిత బోధన, ప్రగతికి మౌలిక వనరుల పెంపు, ఆధునిక సిలబస్, పరిశోధన ప్రోత్సాహం, నైపుణ్య ఆధారిత కోర్సులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, గ్రీన్ ఎనర్జీ, హెల్త్ టెక్నాలజీ చేరవేయాలి. యూనివర్సిటీలలో 'పారిశ్రామిక విభాగాలు' విద్య,ఉద్యోగ అనుసంధానం బలపడుతుంది.

## ప్రజా వేదికకు పెద్ద స్పందన

### సత్వర న్యాయానికి చర్యలు - జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 24-నంద్యాల జిల్లా బొమ్మలసత్రం లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఫిర్యాదుదారుల నుండి 82 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి చట్ట పరిధిలో త్వరిత పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువు లోపల సమస్యలు పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని హెచ్చరించారు.భూ మోసాలు ఉద్యోగాల పేరుతో మోసాలు వాహనాల అపహరణలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయని తెలిపారు. బాధితులకు న్యాయం చేయడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## హైదరాబాద్ రియల్ ఎస్టేట్ దూసుకెళ్తోంది

**కోకాపేట భూముల వేలంలో రూ.1,355.33 కోట్లు ఆదాయాన్ని ఆర్జించిన హెచ్ఎండీఏ - ఎకరం అత్యధికంగా 137.25 కోట్లు పలికిన భూముల ధర**



విభారే న్యూస్‌హైదరాబాద్, నవంబర్24, 2025: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు కోకాపేట లో జరిగిన భూముల వేలం గణనీయమైన విజయాన్ని ప్రకటించింది. ఇందులో ఎకరానికి రూ.137.25 కోట్లు పలకడం ద్వారా దేశంలోనే కాకుండా ఆసియా స్థాయిలో నూ ఇది ఒక మైలురాయిగా నిలిచింది. ఈరోజు వేలంలో హెచ్ఎండీఏ 9.90 ఎకరాలకు గానీ 1,355.33 కోట్లు ఆదాయాన్ని పొందింది. ప్లాట్ నెంబర్ 17 లో 4.59 ఎకరాలు ఉండగా.. ఈ వేలం లో వజ్ర డెవలపర్స్ ఎకరానికి 136.50 కోట్లు బిడ్డింగ్ చేసింది. అలాగే ప్లాట్ నెంబర్ 18లో 5.31 ఎకరాలు ఉండగా.. ఈ వేలంలో ఎంఎస్ఎన్ సంస్థ ఎకరానికి 137.25 కోట్లు ధర వెచ్చిం చింది. ఈ ఘనవిజయంహైదరాబాద్‌ను భారతదేశం లో అగ్రగామిగా నిలబెట్టడమే కాకుండా, దీని దీర్ఘకాలిక వృద్ధిపై పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తోంది.ఈ వేలం విజయం కోకాపేట ప్రాధాన్యతను స్పష్టంగా చాటుతోంది. ఇది హైటెక్ సిటీకి అనుసంధానంగా ఉన్న పశ్చిమ ఐటీ కారిడార్‌కు గేట్వేగా పనిచేస్తోంది. మెగా సాఫ్ట్‌వేర్ కంపెనీలు, కార్పొరేట్ కార్యాలయాల కేంద్రమైన ఈ ప్రాంతంలో భూముల విలువ పెరుగడాన్ని ప్రధాన డెవలపర్లు బహుళ సంవత్సరాల హౌసింగ్, కమర్షియల్ ప్రాజెక్టులకు భూములను ముందుగా సురక్షితంగా భద్రపరుచుకునేందుకు అవకాశంగా చూస్తున్నారు.పౌలోమి ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ శ్రీ ప్రశాంత్ రావు మాట్లాడుతూ, "ఈ ట్రెండ్ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ భవిష్యత్తు ఎంత వాగ్దానంగా , ఇక్కడ వ్యాపారం చేయడంపై పెట్టుబడిదారులకు ఎంత నమ్మకం ఉందో చూపుతోంది," అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఐటీ, ఐటీఈఎస్ రంగాల విస్తరణతో పాటు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ నుండి భారీ స్థాయిలో ఆఫీస్ స్పేస్ డిమాండ్ ఉండటం, దీనివల్ల రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లకు కూడా డిమాండ్ పెరగనుంది.ఈ రికార్డు ధరలు పెట్టుబడిదారులు, డెవలపర్లు హైదరాబాద్‌పై కలిగి ఉన్న విశ్వాసానికి ప్రతిరూపం.అలాగే,"తెలంగాణ రైజింగ్ 2047"దిశగా ప్రభుత్వం చూపుతున్న దూరదృష్టికి ప్రతిఫలంగా పరిగణించబడుతోంది.ఈ విజయాన్ని పారదర్శకత, పెట్టుబడికి అనుకూలమైన వాతావరణం, మరియు వేగవంతమైన అభివృద్ధి సాధించే వ్యవస్థను ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం తీసుకున్న కట్టుబాటుకే ఫలితంగా ప్రభుత్వం పేర్కొంది.ఈ అభివృద్ధికి గౌరవనీయ ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారు, మరియు గౌరవనీయ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి శ్రీ డి. శ్రీధర్ బాబు గార్లు నేతృత్వం వహిస్తున్నారు. ఇది కేవలం ఊహాత్మక పెట్టుబడి కాకుండా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం. ధరలు పెరిగినప్పుడు డెవలపర్లు ఆచితూచి ప్రాజెక్టుల రూపకల్పన చేయాల్సిన అవసరం ఉంటుంది. అయితే, హైదరాబాద్ మార్కెట్ ఇందుకు పూర్తిగా సిద్ధంగాఉంది. మధ్య తరగతి, అప్పర్ మిడ్ సెగ్మెంట్లకు అనుగుణంగా అభివృద్ధి చేసిన ప్రాజెక్టులకు వినియోగదారుల మద్దతు ఉంది.ఈ కోకాపేట వేలం విజయవంతం కావడం ద్వారా, హైదరాబాద్ దేశంలో అత్యంత స్థిరమైన, వ్యూహాత్మకంగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందుతున్న ప్రాపర్టీ మార్కెట్లలో ఒకటిగా మరింతగా గుర్తింపు పొందింది. ఇది మార్కెట్లో ముడి ధనాల లభ్యత, పెట్టుబడిదారుల నమ్మకం రెండింటినీ స్పష్టంగా చూపిస్తుంది.

## టిడ్కో గ్రుహ లబ్ధిదారులకు భారీ అవగాహన శిబిరం

### 27న టౌన్ హాల్లో ప్రత్యేక కార్యక్రమం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 24-నంద్యాల పట్టణంలో టిడ్కో గ్రుహాల అర్హులైన లబ్ధిదారులకు బ్యాంక్ లోన్, రిజిస్ట్రేషన్ ప్రక్రియలపై విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ నెల 27వ తేదీన టౌన్ హాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మెప్మా పీడీ వెంకటదాస్ తెలిపారు.సోమవారం మెప్మా కార్యాలయంలో జిల్లా వయోజన విద్యా అధికారి, సీఎంఎం,శోభ. సీఓలు శ్రీదేవి. సరళదేవి. లక్ష్మీ దేవి. హిమబిందు . పాల్గొన్న సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో మొత్తం 366 టిడ్కో గ్రుహాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులకు బ్యాంక్ లోన్ శాంక్షన్ త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సదుపాయ సహాయం అందించాలన్నారు.ఈ 366 గ్రుహాల్లో 152 మంది పొదుపు సంఘాలకు చెందిన మహిళా లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. వారితో పాటు ఇతర లబ్ధిదారులందరికీ పూర్తి సమాచారం అందించి, అవసరమైన పత్రాల సమర్పణ, బ్యాంకు ప్రక్రియపై సందేహాలు నివృత్తి చేయడానికే ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మెప్మా పీడీ వెంకటదాస్ స్పష్టం చేశారు. అందరూ లబ్ధిదారులు తప్పకగా హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు మెప్మా సిబ్బంది రామకృష్ణ. సంపత్. సమీన పాల్గొన్నారు

## దత్తత ద్వారా ప్రతి చిన్నారికి ప్రేమతో కూడిన స్థిరమైన కుటుంబాన్ని కల్పించండి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, నవంబర్ 24 దత్తత ద్వారా ప్రతి చిన్నారికి ప్రేమతో కూడిన స్థిరమైన కుటుంబాన్ని కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియం లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దత్తత అవగాహన కార్యక్రమాలు - 2025 కు సంబంధించి పోస్టర్ ను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..నవంబర్ మాసాన్ని ప్రపంచ వ్యాప్తంగా దత్తత గుర్తింపు మాసం గా పాటిస్తున్న నేపథ్యంలో, జిల్లాలో దత్తతపై అవగాహనను మెరుగుపరచాలని, ప్రత్యేకించి ప్రత్యేక అవసరాలు గల పిల్లల దత్తతను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శారీరక, మానసిక, అభివృద్ధి సంబంధిత సవాళ్లు ఉండవచ్చు కానీ వారికి అత్యవసరంగా కావా ల్సింది ప్రేమ, ఆదరణ, సంరక్షణ, స్థిరమైన కుటుంబ వాతావరణం అని, దత్తత ద్వారా ఈ చిన్నారులకు జీవితం మార్చే అవకాశాన్ని కల్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ సంవత్సరం (2025) థీమ్‌ను ఫాస్టర్ కేర్ ఓ ఫాస్టర్ అడాప్షన్ గా ప్రకటిస్తూ, పెద్ద పిల్లలకు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శాశ్వత కుటుంబాలను అందించడానికి సమాజంలో చైతన్యం పెంపొందించడమే లక్ష్యం గా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు.

## వ్యవసాయానికి కూటమి అండ మంత్రి ఫరూక్

### రైతన్నా-మీకోసం కార్యక్రమం ప్రారంభం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 24-నంద్యాల మండలం పోలూరు గ్రామంలో సోమవారం రైతన్నా-మీకోసం కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతుల ఇంటింటికి వెళ్లి పాంప్లెట్లు పంపిణీ చేశారు.కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, చంద్రన్న నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నవంబర్ 24 నుండి 29 వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.రైతులకు గిట్టుబాటు కల్పించేందుకు పంచ సూత్రాల విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. అవి నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అని వివరించారు. ఈ సూత్రాల ద్వారా వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకువచ్చి అన్నదాతలకు పూర్తి స్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, స్థానిక నాయకులు, మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు. అధికారులు, సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## భైలుప్పలలో విషాదం

### గుండెపోటుతో వ్యాపారి ఖాజా హుస్సేన్ మృతి...



విభారే న్యూస్ నవంబర్ 24 ఎమ్మిగనూరు..గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామంలో బట్టల వ్యాపారం, హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న 50 ఏళ్ల కే.ఎం. హుస్సేన్ సాబ్ సోమవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా కన్నుమూశారు.ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబాన్ని ఆదుకునే ప్రధాన స్థంబం అయిన హుస్సేన్ మృతి చెందడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.స్థానికులతో స్నేహపూర్వకంగా మెలిగే స్వభావం గల వ్యక్తి అని గ్రామస్తులు తెలిపారు. హఠాత్తుగా జరిగిన ఈ ఘటనపై గ్రామస్థులుగ్ర్భ్బంతి వ్యక్తం చేస్తూ కుటుంబానికి ధైర్యం చెప్పుతు న్నారు. సంతాపం వ్యక్తం చేసిన గ్రామస్తులుఎవరికి అవసరం వచ్చినా ముందుండి సాయం చేసేవాడు.గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండేవాడు.

## బుట్టా రేణుక దంపతులకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేసిన అహమ్మద్ అలీ ఖాన్...



విభారే న్యూస్ నవంబర్ 24 కర్నూలు జిల్లా ప్రతినిధి..కర్నూలు జిల్లా పార్లమెంట్ సమన్వయకర్త బుట్టా రేణుక దంపతులకు వివాహ ఆహ్వానం అందజేసిన కర్నూలు నగర అధ్యక్షులు అహమ్మద్ అలీ ఖాన్. కర్నూలు పట్టణ నగర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అహమ్మద్ అలీ ఖాన్ తన కుమార్తె వివాహానికి విచ్చేయాలని కోరుతూ, కర్నూలు జిల్లా పార్లమెంట్ సమన్వయకర్త బుట్టా రేణుక కి, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠ కి, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్ కి కర్నూలు పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో స్వయంగా వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని అహమ్మద్ అలీ ఖాన్ కోరారు.

## ఎస్ టి యు జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా ఎం.సి.సుంకన్న..




విభారే న్యూస్ నవంబర్ 24 ఆదోని..ఆదివారం కర్నూలు నగరంలోని ఎస్ టి యు సలాం ఖాన్ భవనం లో ఏర్పాటుచేసిన జిల్లా వార్షిక సమావేశం లో నూతన కార్యవర్గమును ఎన్నుకున్నారు. ఎస్ టి యు జిల్లా అధ్యక్షులుగా టి.కే.జనార్ధన్, ప్రధాన కార్యదర్శిగా ఎం సి సుంకన్న, కోశాధికారిగా ఎం శ్రీధర్ ను కార్యవర్గము ఎన్నుకున్నారు. వీరికి ఆదోని పట్టణ ఎస్ టి యు శాఖ ప్రత్యేక అభినందనలు తెలుపుతూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## జడ్పీ అంశాలపై వేగవంతమైన పరిష్కారం

### డ్రోన్ వినియోగ నమోదు తప్పనిసరి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 24-జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. నందికొట్కూరు జడ్పీ హై స్కూల్ సమీపంలోని మద్యం దుకాణం తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, ఎన్ ఎచ్ 340 సి రహదారి కారణంగా బ్రాహ్మణకొట్కూరు రైతుల ఇబ్బందులు పరిష్కరించాలని సూచించారు. హంద్రీ?నీవా కెనాల్ పనుల్లో పొలాల్లో పడిన ఇసుక తొలగించాలని, బన్నూరు రైతు సేవా కేంద్రం పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశాలకు జడ్పిటిసి,ఎంపీటీసీలకు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం పంపాలని తెలిపారు. చెరువుల అక్రమణలు తొలగించి బండ్ల బలపర్చే విధంగా డిసిల్టింగ్ చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన 7 నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్లలో పాణ్యం, ఆత్మకూరు, ఆళ్లగడ్డ యూనిట్లు తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వ డ్రోన్ల వినియోగ వివరాలను ప్రతిరోజూ నమోదు చేసి కలెక్టరేట్‌కు పంపాలని సూచించారు.

# నంద్యాల ఐఎంఏకు నాలుగు ప్రతిష్ఠాత్మక రాష్ట్ర పురస్కారాలు

### రాజంపేటలో ఘనంగా సత్కార కార్యక్రమం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 24-రాజంపేట లో నిర్వహించిన 67వ ఆంధ్రప్రదేశ్ ఐఎంఏ రాష్ట్ర సదస్సులో నంద్యాల ఐఎంఏ కు నాలుగు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దిలీప్ బానుశాలి చేతుల మీదుగా ఈ అవార్డులు అందజేశారు. గత సంవత్సర కాలంలో నంద్యాల ఐఎంఏ నిర్వహించిన విశిష్ట సేవలను గుర్తించిన రాష్ట్ర ఐఎంఏ అవార్డ్స్ కమిటీ, మీడియం బ్రాంచ్ విభాగంలో నంద్యాల ఐఎంఏకు ఉత్తమ శాఖ పురస్కారం, ఉత్తమ అధ్యక్షుడిగా డాక్టర్ మధుసూదన రావుకు అవార్డు, నంద్యాల ఐఎంఏ మహిళా విభాగానికి ఉత్తమ సామాజిక సేవల పురస్కారం, అలాగే నంద్యాలలో నిర్వహించిన ప్రాంతీయ వైద్య వైజ్ఞానిక సదస్సుకు ప్రత్యేక పురస్కారం ప్రకటించింది. ఈ పురస్కారాలను నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ సహదేవుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ హరిత, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ వినోద్ కుమార్ లు కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ మధుసూదన రావు మాట్లాడుతూ నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో గత ఏడాది కాలంలో సామాజిక సేవలు, వైద్య అవగాహన శిబిరాలు, నిరంతర వైద్య విద్యా సదస్సులు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణలు తదితరంగా మొత్తం 146 కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ సేవలను గుర్తించి రాష్ట్ర ఐఎంఏ ఈ పురస్కారాలతో గౌరవించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సమాజ హిత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. పురస్కార గ్రహీతలను ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, నంద్యాల ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మహమ్మద్ రఫీ, సీనియర్ సభ్యులు డాక్టర్ సహదేవుడు తదితరులు అభినందించారు.

## చైర్ పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన కౌన్సిల్ సమీక్ష

### 40 అంశాలపై కీలక చర్చ




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 24-నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం 26.11.2025 బుధవారం ఉదయం గం 11.00లకు మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు చైర్ పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన, కమిషనర్ బి శేషన్న ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సమావేశానికి సంబంధించి పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, పన్నుల వసూలు తదితర అంశాలపై మొత్తం 40 అంశాలతో అజెండాను సిద్ధం చేసినట్లు కమిషనర్ బి శేషన్న తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అజెండాలోని ప్రతి అంశంపై సమగ్రంగా చర్చించి పట్టణాభివృద్ధికి దోహదపడే నిర్ణయాలు తీసుకోవడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమయపాలన పాటిస్తూ ప్రతి సభ్యుడు సమర్థవంతంగా పాల్గొని సహకరించాలని మున్సిపల్ యంత్రాంగం కోరింది.

## కె పద్మావతికి రోటరీ ఘన సన్మానం

### ఉత్తమ సేవలకు 'బెస్ట్ నర్స్ అవార్డు'తో గౌరవం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 24-నంద్యాల సచివాలయ హెల్త్ సెక్రటరీ కె పద్మావతి ప్రజారోగ్య రంగంలో అందిస్తున్న నిరంతర సేవలకు గాను రోటరీ క్లబ్ నంద్యాల ఆధ్వర్యంలో 'బెస్ట్ నర్స్ అవార్డు'తో ఘనంగా సన్మానించారు. నంద్యాల ఎస్వీఎస్ రోటరీ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు ఆమెకు జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసి ఘనంగా అభినందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆమె చూపుతున్న అంకితభావం, సేవా నిబద్ధత అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. గ్రామ, పట్టణ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ముందుండి పనిచేస్తూ రోగుల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తున్న కె పద్మావతి సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు హెల్త్ సెక్రటరీలు, వైద్య సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో సేవలు అందించి మరిన్ని గౌరవాలు పొందాలని ఆకాంక్షించారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన 95 ఫిర్యాదులను విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం ...





విభారే న్యూస్ నవంబర్ 23 కర్నూలు జిల్లా ప్రతినిధి..కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ .ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 95 ఫిర్యాదులు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 95 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..1)నాకు వచ్చిన ఒక ఈ - మెయిల్ లో కర్నూలు ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ కి సంబంధించి ఇండిగో ఎయిర్లైన్స్ కంపెనీ లో ఉద్యోగం ఇప్పిస్తామని,ఆన్ లైన్ లో మునేష్ అనే వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. సీనియర్ ఫ్లోర్ మేనేజర్ గా ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఫోన్ పే స్కానర్ ద్వారా రూ.23 వేలు వేయించుకొని మోసం చేశాడని కర్నూల్, షరీన్ నగర్ కు చెందిన పుల్లయ్య ఫిర్యాదు చేశారు. 2)కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ మేరకు పొలం వేసుకున్నాము. మా నాన్న కంటి ఆపరేషన్ కొరకు మేము కర్నూలుకు వెళ్ళగా,మేము లేనిది తెలుసుకుని మాకు తెలియకుండా చిన్న సుంకన్నతో పాటు 30 మంది కలిసి వరి పంటను కోసుకొని వెళ్ళిపోయారని కోడుమూరు మండలం, లద్దగిరి గ్రామానికి చెందిన విక్రమ్ ఫిర్యాదు చేశారు. 3) కోడుమూరు కు చెందిన హనుమన్న టాటా ర్యాలీస్ కంపెనీ తరపున నకిలీ మొక్క జొన్న విత్తనాలు ఇచ్చి మోసం చేశాడని, పెట్టుబడి ఖర్చులు, ఇన్సూరెన్స్ డబ్బులు అడిగితే ఇవ్వడంలేదని న్యాయం చేయాలని తుగ్గలి మండలం, లంకాయపల్లి గ్రామం కు చెందిన శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. 4.శ్రావణ అనే వ్యక్తి కంప్యూటర్ జాబ్ ఇప్పిస్తామని చెప్పి రూ .40 వేలు తీసుకున్నాడు, ఇంతవరకు జాబ్ ఇప్పించలేదు, డబ్బులు తిరిగి ఇవ్వడం లేదు,3 సంవత్సరాల నుండి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఎమ్మిగనూరు పట్టణం కు చెందిన సురేంద్రబాబు ఫిర్యాదు చేశారు. 5.పుల్లగుమ్మికి చెందిన వడ్డే వెంకటేశులు, వడ్డే వెంకటరాముడు కలిసి నా 100 క్వింటాళ్ల (రూ.13 లక్షల విలువ చేసే) మిరప పంటను తీసుకెళ్ళారు. ఇంతవరకు డబ్బులు ఇవ్వలేదు, డబ్బులు వారం లోపల ఇస్తామని చెప్పి, 8 నెలలు అయినా కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని క్రిష్ణగిరి మండలం, ఆగవెల్లి గ్రామం చెందిన వడ్డె గిడ్డయ్య ఫిర్యాదు చేశారు. 6).కర్నూలు మున్సిపాలిటీలో స్వీపర్ ఉద్యోగనీ ఇప్పిస్తామని చెప్పి కురువ భీమన్న రూ.30 వేలు తీసుకొని మోసం చేశాడని కర్నూల్ బండి మెట్ట కు చెందిన వెంకటరమణ ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్‌పీరా,సిఐలుశివశంకర్,రామకృష్ణ, విజయలక్ష్మి లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతుల స్వీకరణ



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 24-నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెవిన్యూ అధికారి వెంకటరెడ్డి పట్టణ ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను వివరంగా వెల్లడించగా, వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలో నెలకొన్న మౌలిక వసతుల లోపాలు, పన్నుల అంశాలు, భూసంబంధ వివాదాలు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా వంటి సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత శాఖలకు సూచనలు జారీ చేశారు. ప్రజలకు న్యాయం అందే విధంగా పారదర్శకంగా వ్యవహరిస్తామని వెంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శిల్పా, సీనియర్ అసిస్టెంట్ నాగ బ్రహ్మం పాల్గొనగా, ఇతర శాఖల అధికారులు కూడా హాజరై ప్రజలతో సమన్వయం చేసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పట్టణ ప్రజలకు సూచించారు.

# రోడ్డు భద్రత పై అవగాహన కు హెల్మెట్,ఆటోల ర్యాలీని ప్రారంభించిన జిల్లా.. ఎస్పీ..

### హెల్మెట్ ధరించి అవగాహన బైక్ ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఎస్పీ




విభారే న్యూస్ నవంబర్ 24 కర్నూలు జిల్లా ప్రతినిధి..ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాల్సిందే. హెల్మెట్ ధరించడం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం. సోమవారం కర్నూలు జిల్లా కేంద్రంలో ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించేందుకు హెల్మెట్,ఆటోల ర్యాలీ ని కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే విధంగా అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హెల్మెట్ అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. హెల్మెట్ ధరించి అవగాహన బైక్ ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ అవగాహన ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయం నుండి ప్రారంభమై కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్,రాజ్ విహార్,కలెక్టరేట్ మీదుగా సి. క్యాంపు సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ మీడియాతో మాట్లాడుతూ ఈ రోజు ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమంలో భాగంగా కర్నూలు ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాలు జరిగిన ఆడియోలను ఆవిష్కరించడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ ధరించి ఉంటే చనిపోకుండా బతికి బయటపడే అవకాశం ఉండేదేమో అనే విధంగా భాధితుల కుటుంబాలు చెప్పడం జరిగిందని,ఆ రోడ్డు ప్రమాదాల విడియోలతో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ భాద్యతగా హెల్మెట్ ధరించాల్సిందేన్నారు. మొదటి సారిగా జరిమానాలు విధించకుండా హెల్మెట్ ధారణ పై అవగాహన కల్పిస్తామన్నారు. తర్వాత కౌన్సిలింగ్ చేస్తామన్నారు. రాబోయే రోజులలో ద్విచక్ర వాహనదారులు ఐ ఎస్ ఐ-మార్క్ ఉన్న హెల్మెట్లను ధరించాల్సిందేనన్నారు. అందరూ హెల్మెట్లు కోనుగోలు చేసి బైకులు నడిపే విధంగా, హెల్మెట్లు వినియోగించే విధంగా సమయం ఇస్తామన్నారు. సాయంత్రం వేళల్లో పట్టణంలోని రద్దీ ప్రాంతాలు,ట్రాఫిక్ జంక్షన్ లలో రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన విడియోలతో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. రోడ్డు ప్రమాదాల విడియోలను చూసి ఆ భయంతోనైనా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లు ధరించి బైక్ లు నడిపేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రోడ్డు ప్రమాదాలు,మరణాలు తగ్గించేందుకు గట్టిగా కృషి చేస్తామన్నారు. రోడ్డు భద్రత పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు,అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పౌరుడు తన భద్రతకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, ఒపెన్ డ్రింకింగ్ తనిఖీలు చేపడుతున్నారన్నారు. ఈ అవగాహన ర్యాలీ లో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్ , సిఐలు మన్సురుద్దీన్, విక్రమసింహా,తేజా మూర్తి, చంద్రబాబునాయుడు, మధుసుధన్ రావు, పార్థసారథి,ఆర్ ఐలు, ఎస్సైలు,ఆర్ ఎస్సై లు, ట్రాఫిక్ పోలీసులు,సివిల్ , ఎఆర్,ఆయా షోరూం యువకులు,ఆటోల డ్రైవర్లు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**